

**ఎంఎల్‌సి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు బిజెపి, బిఆర్ఎస్ కుట్రలు: మంత్రి కొండా సురేఖ**


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..









సంపుటి - 2 సంచిక -1 ఆదివారం 23 ఫిబ్రవరి 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# కుప్పకూలిన టన్నెల్



## ఎస్ఎల్బిసిలో ప్రమాదం



- సొరంగం పైకప్పు కూలి చిక్కుపడిన 8మంది
- టన్నెల్ బోరింగ్ సమయంలో 9మీటర్ల మేర కూలిన పైకప్పు
- ప్రమాదానికిసీపేజ్ వాటరే కారణం
- సురక్షితంగా బయటపడిన 42మంది కార్మికులు
- వీరంతా యుపి, జమ్మూకశ్మీర్కు చెందిన వారు
- సొరంగం లోపల 14కి.మీ దూరంలో దుర్ఘటన
- క్లిష్టంగా మారిన సహాయకచర్యలు
- ఎన్ఐఆర్ఎఫ్ బృందాలతో రెస్క్యూ ఆపరేషన్

2లో

### టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని ఆరా

**సిఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి తెలుసుకున్న మోడీ**



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ ఆరా తీశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను రేవంత్‌రెడ్డి.. ప్రధానికి వివరించారు.

## ప్రధాని మోదీ 2వ ముఖ్య కార్యదర్శిగా ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్



న్యూఢిల్లీ,ఫిబ్రవరి3(జర్నలిస్ట్ వార్త): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ–2గా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ ఆమోదించింది. శక్తికాంత దాస్ భాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన నియమాకం అమల్లోకి వస్తుంది. ప్రధానమంత్రి టర్మ్ వరకు కానీ తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. పీకే మిశ్రా 2019 సెప్టెంబర్ 11 నుంచి ప్రధానమంత్రికి పర్సనల్ సెక్రటరీగా ఉన్నారు. ఆరేళ్ల పాటు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన శక్తికాంత దాస్ గత ఏడాది డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు. దీంతో ఆర్బీఐ 26వ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించారు. 67 ఏళ్ల శక్తికాంత దాస్ 2018లో ఊర్జిత్ పటేల్ అకస్మాత్తుగా రాజీనామా చేయడంలో ఆర్బీఐ గవర్నర్ గవర్నర్ బాధ్యతలు చేపట్టారు. 1980 తమిళనాడు ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాస్ ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కాలేజీలో మాస్టర్ డిగ్రీ చేశారు. బర్మింగ్‌హామ్ యూనివర్శిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. 2016 నవంబర్‌లో పెద్దనోట్లను రద్దు చేసినప్పుడు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా శక్తికాంతదాస్ ఉన్నారు. 2017 జూలై 1 నుంచి పలు ప్రత్యక్ష పన్నులు జీఎస్‌టీలో విలీనం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. 2021లో ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన పదవికాలం ముగియాల్సి ఉండగా మరో మూడేళ్లు పదవీకాలాన్ని పొడిగించారు.

## గ్రూప్-2 పరీక్ష వాయిదావేయలేం..

- ప్రభుత్వ లేఖకు బదులిచ్చిన ఏపీపీఎస్సీ
- ఏపీలో గ్రూప్-2 మెయిన్స్
- వాయిదా వేయాలంటున్న అభ్యర్థులు
- ఏపీపీఎస్సీకి లేఖ రాసిన రాష్ట్ర ప్రభుత్వం
- పరీక్ష యథాతథంగా నిర్వహిస్తున్నామన్న ఏపీపీఎస్సీ




## అమరావతి నిర్మాణ పనులకు ముహూర్తం ఖరారు

**మార్చి 15నుంచి ప్రారంభం అవుతాయని వెల్లడి**

**30వేల మంది కార్మికులతో శరవేగంగా నిర్మాణ పనులు**

అమరావతి,ఫిబ్రవరి3(జర్నలిస్ట్ వార్త):రాజధాని అమరావతి పనుల ప్రారంభానికి ప్రభుత్వం ముహూర్తం నిర్ణయించింది. ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతాయా అని ఎదురుచూస్తున్న వేళ కీలక సమాచారం వచ్చేసింది. మార్చి 15 నుంచి రాజధాని పనులు ప్రారంభంకానున్నట్లు వెల్లడించింది.

.మిగతాది 2లో...





## ఇద్దరు ఐపీఎస్ అధికారులను రిలీవ్ చేసిన తెలంగాణ

- అంజని కుమార్, అభిలాష బిస్త్‌ను రిలీవ్ చేసిన తెలంగాణ
- జీవో జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ రిలీవ్‌పై ఈసీకి ప్రభుత్వం లేఖ



## అంగన్వాడీ కేంద్రాల్లో 14,236 కొలువులు

- భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినమంత్రి సీతక్క
- 6వేలుఅంగన్వాడీ టీచర్లు, 7వేలహెల్పర్ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- కోడ్ ముగియగానే జిల్లాల వారీగా నోటిఫికేషన్లు

## రాహుల్ గాంధీ ఆశయం మేరకే

**: బీసీ కులగణనపై రేవంత్ రెడ్డి**


- బీసీ కులగణన సర్వేపై అనుమానాల నివృత్తి
- రేవంత్ రెడ్డి మీడియా సమావేశం
- కులగణన చారిత్రాత్మకమైన నిర్ణయమన్న ముఖ్యమంత్రి
- కులగణన విషయంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని వెల్లడి



హైదరాబాద్ ఫిబ్రవరి3(జర్నలిస్ట్ వార్త): బీసీ కులగణన ఒక సాహసోపేత నిర్ణయమని, రాహుల్ గాంధీ ఆశయం మేరకే సమగ్ర కులగణన చేపట్టామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీసీ కులగణన సర్వేపై అనుమానాల నివృత్తిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ,

## మిర్చి రైతుల సమస్యలపై బాబుఫోకస్

**రైతు సంఘం నేతలతో చంద్రబాబు చర్చ**



అమరావతి, ఫిబ్రవరి3(జర్నలిస్ట్ వార్త):మిర్చి రైతుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పెషల్ ఫోకస్ పెట్టారు. చంద్రబాబుతో రైతు సంఘం నేత మన్నవ సుబ్బారావు శనివారం ఏపీ సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలను మీడియాకు మన్నవ సుబ్బారావు వెల్లడించారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతు సంఘం నేత మన్నవ సుబ్బారావు తెలిపారు.

.మిగతాది 2లో...



## కేంద్రాన్ని గట్టిగా ప్రశ్నిస్తే ఉద్యోగం పోతుందని రేవంత్ రెడ్డికి భయం: కేటీఆర్

- కృష్ణా జలాల విషయంలో ఉత్తరం రాసి చేతులు దులిపేసుకున్నారని విమర్శ
- రేవంత్ రెడ్డి 'ఆర్' ట్యాక్స్‌పై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సవాల్
- రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు కాపాడుతోందని ప్రశ్న

# గ్రూప్-2 పరీక్ష వాయిదావేయలేం..

**అమరావతి,ఫిబ్రవరి3(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో రేపు (ఫిబ్రవరి 23) జరగాల్సిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను అభ్యర్థుల ఆందోళలను దృష్టిలో ఉంచుకుని వాయిదా వేయాలని ఏపీ ప్రభుత్వం రాసిన లేఖకు ఏపీపీఎస్సీ బదులిచ్చింది. రేపటి పరీక్షను వాయిదా వేయలేమని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, గ్రాడ్యుయేట్లకు ప్రయోజనం కల్పించే నిర్ణయాలు తీసుకోలేమని ఏపీపీఎస్సీ స్పష్టం చేసింది. అందుకే రేపు జరగాల్సిన పరీక్షను షెడ్యూల్ ప్రకారమే యథాతథంగా నిర్వహిస్తున్నట్టు తెలిపింది. 2023లో గ్రూప్-2 పరీక్షల కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం... రోస్టర్ పాయింట్ల విధానంలో తప్పులున్నాయని, వాటిని సరిదిద్దాకే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని గత కొన్ని రోజులుగా అభ్యర్థులు ఆందోళనలు చేపడుతున్నారు.
గ్రూప్-2 అభ్యర్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీకి లేఖ రాసింది. అయితే, ఈ దశలో పరీక్షను వాయిదా వేయలేమని ఏపీపీఎస్సీ ప్రత్యుత్తరం ఇచ్చింది.

## ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు మద్దతు ప్రకటించిన జనసేన

**అమరావతి,ఫిబ్రవరి3(జర్నలిస్ట్ వార్త):**
శ్రీకాకుళం-విజయనగరం-విశాఖ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పాకాలపాటి రఘువర్మకు మద్దతు ఇస్తున్నట్టు జనసేన పార్టీ హైకమాండ్ నేడు ప్రకటించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. తూర్పు గోదావరి-పశ్చిమ గోదావరి... ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం ఏ విధంగా జనసేన అండగా నిలుస్తుందో... ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఒకే మాట మీద నిలవాలని పవన్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఇవాళ జనసేన రాజకీయ వ్యవహారాల చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన జనసేన ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రదర్శించిన స్ఫూర్తినే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కనబర్చాలని నాదెండ్ల పిలుపునిచ్చారు. ఏపీలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలకు ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేశారు. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుండగా, మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## ఇద్దరు ఐపీఎస్ అధికారులను రిలీవ్ చేసిన తెలంగాణ

**హైదరాబాద్ ఫిబ్రవరి3(జర్నలిస్ట్ వార్త):**
ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష బిస్తను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో బాధ్యతలు చేపట్టేందుకు వీలుగా వారిని వెంటనే రిలీవ్ చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీవోలో పేర్కొన్నారు. అలాగే, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి రిలీవ్‌పై ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది.
కరీంనగర్‌లో ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున అభిషేక్ మహంతి విషయంలో నిర్ణయం తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు.
అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాలని కేంద్ర హోంశాఖ శుక్రవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన అనంతరం డీవోపీటీ రెండు తెలుగు రాష్ట్రాలకు అఖిల భారత సర్వీసు అధికారులను కేటాయించింది. దీనిపై కొందరు అధికారులు క్యాట్‌ను ఆశ్రయించారు. తర్వాత డీవోపీటీ హైకోర్టులో పిటిషన్ వేసింది. తదనంతర పరిణామాల నేపథ్యంలో ముగ్గురు ఐపీఎస్‌లను ఏపీలో రిపోర్ట్ చేయాలని హోంశాఖ ఆదేశించింది.

## మిర్చి రైతుల సమస్యలపై బాబు ఫోకస్

సీఎం చంద్రబాబు రైతులకు సంబంధించి కొన్ని సూచనలు చేశారని అన్నారు. ఎకరాకు రూ.3 లక్షలు అవుతుందంటే సీఎం ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. మిర్చి పంటలకు టెక్నాలజీ. వాడమని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. ఎలక్ట్రానిక్ కాటా ఉపయోగించమని సీఎం చెప్పారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సహాయం అందుతుందని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకుంటాయని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. జగన్ వచ్చినపుడు నిజమైన రైతులు ఆందోళన చేయలేదని చెప్పారు. కిరాయి మూకలు వచ్చి ఆందోళన చేశారని మన్నవ సుబ్బారావు పేర్కొన్నారు. అంతకుముందు మిర్చి రైతులు, యార్డు ట్రేడర్లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. మిర్చి రైతుల సమస్యలు, ప్రస్తుత మిర్చి ధరలపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ, సహచర మార్కెంటింగ్ శాఖ, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గురుతు రాజశేఖర్, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత, వ్యవసాయశాఖకు సంబంధించి అధికారులు, ట్రేడర్లు సమావేశానికి హాజరయ్యారు. ముఖ్యంగా మిర్చి ధర గత కొంతకాలంగా తగ్గుతూ వస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో భేటీ అయి రాష్ట్రంలో మిర్చి రైతుల సమస్యలపై వివరించడం, దానిపై కేంద్రం వెంటనే స్పందించి రాష్ట్రంలో చిల్లి ధర పరిస్థితిపై స్పందించి.. కేంద్రం నుంచి సహాయం అందిస్తామని చెప్పడంతో ఈరోజు గుంటూరు మిర్చి యార్డు ట్రేడర్లు, మిర్చి కొనుగోలు చేసే వర్తకులతో సీఎం కీలక సమావేశం నిర్వహించారు.ఐ

## ఎంఎల్‌సి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు బిజెపి, బిఆర్ఎస్ కుట్రలు: మంత్రి కొండా సురేఖ




**ఫిబ్రవరి3(జర్నలిస్ట్ వార్త):**
ఎంఎల్‌సి ఎన్నికలలో బిజెపి అభ్యర్థులను గెలిపించడానికి బిఆర్ఎస్, బిజెపి క్రాస్ ఓటింగ్ చేయడానికి కుట్రలు పన్నుతున్నారని అటవి, దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఎంఎల్‌సి ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శక్తి గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటేనని గత ఎంపి ఎన్నికలలో సైతం కమలం అభ్యర్థి రఘునందన్‌రావును బిఆర్ఎస్ వాళ్లు గెలిపించారన్నారు. బిఆర్ఎస్ నుండి ఏ ఒక్క అభ్యర్థిని కూడా ప్రస్తుత ఎంఎల్‌సి బరిలో నిలబెట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్రాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ నిరంతరం కాంగ్రెస్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, కానీ ఏ రోజూ బిఆర్ఎస్‌పై ఎందుకు మాట్లాడడం లేదని మండిపడ్డారు.

# అమరావతి నిర్మాణ పనులకు ముహూర్తం ఖరారు

**(మొదటి పేజీ తరువాయి)**
ఏప్రిల్ మొదటి వారం నుంచి అమరావతిలో 30 వేల మంది కార్మికులు పనులు చేస్తారని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో టెండర్లు ఖరారు ఆలస్యం అయ్యింది. టెండర్లు పిలుచుకోవచ్చు కానీ ఖరారు చేయవద్దని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు దాదాపు 62 పనులకు సీఆర్డీఏ, ఏడీసీ టెండర్లను పిలిచింది. సుమారు 40 వేల కోట్ల విలువైన పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. మరో 11 పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని అమరావతి నిర్మాణాన్ని ప్రాధాన్య ప్రాజెక్టు తీసుకుంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ స్వయంగా అమరావతి ప్రాంతాల్లో పర్యటించి అక్కడ నిలిచిపోయిన పనులను పరిశీలించారు. తరువాత చెన్నై ఐఐటీ, హైదరాబాద్ ఐఐటీలకు చెందిన నిపుణుల బృందం అమరావతి ప్రాంతాన్ని సందర్శించారు. అమరావతిలో సెక్రటేరియెట్, అసెంబ్లీ వంటి ఐకానిక్ భవనాల పటిష్టతపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. ఇక్కడ నిర్మాణాలకు ఎలాంటి డోకా లేదంటూ ఐఐటీ బృందం నివేదిక ఇచ్చింది. లాగే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్, ఐఏఎస్, ఐపీఎస్ భవనాలు పటిష్టంగా ఉన్నాయని రిపోర్ట్ ఇచ్చారు. దాదాపు 40 వేల కోట్లకు సంబంధించి 62 పనులపై మార్చి 15 నుంచే శ్రీకారం చుట్టనున్నారు. మిగిలిన 11 పనులకు త్వరలో టెడర్లను పూర్తి చేసి రెండున్నరేళ్లలో అమరావతి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే అమరావతిలో పేరుకుపోయిన జంగిల్ క్లియరెన్స్‌ను పూర్తిస్థాయిలో తొలగించేశారు. దీంతో నిర్మాణాలకు ఎలాంటి ఆటంకం లేకుండా శరవేగంగా పనులు ముందుకు సాగుతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

# రాహుల్ గాంధీ ఆశయం మేరకే...!



కులగణన చేపట్టడం ద్వారా తమ ప్రభుత్వం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుందని అన్నారు.
కులగణన విషయంలో భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు.రాహుల్ గాంధీ సుమారు 25 రోజుల పాటు తెలంగాణలో పాదయాత్ర చేశారని, సోనియా గాంధీ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని తెలంగాణను ఇచ్చారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ మాట ఇచ్చిన తర్వాతే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. త్రికరణ శుద్ధిగా లెక్కలు తేల్చామని, వందేళ్లలో జరగని దానిని 100 శాతం సరైన లెక్కలను తేల్చామని ఆయన అన్నారు.ఈ సర్వే పూర్తి పారదర్శకంగా జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వంలోని 15 శాఖలకు చెందిన అధికారుల ద్వారా, మొత్తం 8 పేజీలతో ఇంటి యజమాని ఇచ్చిన సమాచారాన్ని సేకరించామని తెలిపారు. సుమారు కోటీ పన్నెండు లక్షల కుటుంబాలు కులగణన సర్వేలో పాల్గొన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. న్యాయపరంగా, చట్టపరంగా, నిబంధనలకు లోబడి సర్వే చేసినట్లు చెప్పారు. 96.9 శాతం మంది సర్వేలో పాల్గొనగా, 3.1 శాతం మంది పాల్గొనలేదని తెలిపారు.
కొంతమంది నాయకులు కులగణనకు దూరంగా ఉన్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ హయాంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో నాలుగు విభాగాలుగా జనాభా శాతాన్ని చెప్పగా, తాజా సర్వేలో 5 విభాగాలు ఉన్నట్లు చెప్పారు. ముస్లింలలోని ఓబీసీలను నాడు ప్రత్యేకంగా చెప్పలేదని ఆయన వెల్లడించారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిన అవశ్యకత ఉందని ముఖ్యమంత్రి అన్నారు.
రాహుల్ గాంధీ ప్రధాని అయితే అన్ని రాష్ట్రాల్లో కులగణన జరుగుతుందని జోస్యం చెప్పారు. కులగణన జరగకపోతే బీసీలు నష్టపోతారని హెచ్చరించారు. మంచి చేసిన తనను రాళ్లతో కొడతామంటే నష్టపోయేది బీసీలే అన్నారు.
బీసీ జనాభా ప్రకారం వారికి అవకాశం కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కులగణనకు చట్టబద్ధత కల్పిస్తామని తెలిపారు. "బీసీ మిత్రులకు నా విజ్ఞప్తి. మీ కోసం నేను నా శక్తి మేరకు సాహసం చేశా. దీనిని సొంతం చేసుకోవాల్సిన బాధ్యత మీదే" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## కేంద్రాన్ని గట్టిగా ప్రశ్నిస్తే ఉద్యోగం పోతుందని రేవంత్ రెడ్డికి భయం: కేటీఆర్



**హైదరాబాద్ ఫిబ్రవరి3(జర్నలిస్ట్ వార్త):**
**కృష్ణా జలాల్లో న్యాయమైన** వాటా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తే తన ఉద్యోగం పోతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భయపడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి కేవలం ఉత్తరం రాసి చేతులు దులిపేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఎండగడతామని ఆయన అన్నారు. గతంలో కేసీఆర్ నల్గొండలో ధర్నా చేసిన తర్వాతనే అసెంబ్లీలో ఈ అంశంపై తీర్మానం చేశారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణలో 'ఆర్' ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారని, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి చేతనైతే 'ఆర్' ట్యాక్స్‌పై చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాలపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా చర్యలు లేవని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు కాపాడుతోందని ప్రశ్నించారు. ఆయన బీజేపీలో చేరతారని లోపాయికారి ఒప్పందం ఏమైనా ఉందా? అని నిలదీశారు. అమృత్ టెండర్లలో ముఖ్యమంత్రి బావమరిది అక్రమాలకు పాల్పడ్డాడని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ దాడులు చేసిందని, అయినప్పటికీ చర్యలు లేవని విమర్శించారు. సుంకిశాల ప్రమాదంలో కూడా రేవంత్ రెడ్డి ఎవరిని కాపాడుతున్నారో తెలుసని కేటీఆర్ అన్నారు.

# కుప్పకూలిన టన్నెల్

**హైదరాబాద్ ఫిబ్రవరి3(జర్నలిస్ట్ వార్త):**
ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ ఇంకా ప్రారంభం కాలేదు. టన్నెల్ ప్రమాదంపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతోంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది టన్నెల్‌లోనే చిక్కుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పదమూడు గంటలుగా వారు టన్నెల్‌లోనే ఉండిపోయారు. ప్రమాద ప్రాంతంలో నీరు, బురద, మట్టి ఉన్నట్లు గుర్తించారు.ప్రమాదం జరిగిన ప్రాంతానికి మూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వచ్చాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సాగునీటి పారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఈ సమీక్షలో పాల్గొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై వారు సమీక్షించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ప్రమాద ఘటన సమాచారం అందుకున్న వెంటనే ఆయన హెలికాప్టర్ లో టన్నెల్ వద్దకు చేరుకున్నారు. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా టన్నెల్ కూలిపోయిన ప్రదేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉదయం 8 గంటలకు కార్మికులు సొరంగం లోపలికి వెళ్లారని, ఉదయం 8.30 గంటలకు బోరింగ్ మెషీన్ ను ఆన్ చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. 20 మీటర్లు డ్రిల్లింగ్ చేయగానే టన్నెల్ లోకి నీళ్లు లీక్ అయ్యాయని వివరించారు. టన్నెల్ లో ఒకవైపు నుంచి నీరు లీక్ కావడంతో మట్టి కుంగిపోయిందని తెలిపారు.
బోరింగ్ మెషీన్ ఆపరేటర్ ప్రమాదాన్ని ముందే పసిగట్టాడని, దాంతో బోరింగ్ మెషీన్ వెనకున్న 42 మంది కార్మికులను బయటికి పంపించివేశారని మంత్రి



ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. బోరింగ్ మెషీన్ కు ముందున్న 8 మంది బయటికి రాలేక టన్నెల్ లోపల చిక్కుకున్నారని తెలిపారు. వారిలో ఇద్దరు విదేశీ ఇంజినీర్లు, ఇద్దరు మెషీన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. విదేశీ ఇంజినీర్లు మినహా మిగిలిన వారు యూపీ, ఝార?ండ్ కు చెందిన వారు అని వివరించారు. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని ప్రాణాలతో కాపాడేందుకు సర్వశక్తులా కృషి చేస్తున్నామని అన్నారు. 14 కిలోమీటర్ల లోపల ఉన్నందున సహాయ చర్యలు క్లిష్టంగా మారాయని తెలిపారు. ఇలాంటి ఆపరేషన్స్ లో నిపుణలైన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని తీసుకువస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.ప్రమాద ఘటనపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ లోపల చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకురావాలన్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని స్పష్టం చేశారు.ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి పూర్తి బాధ్యత రేవంత్ రెడ్డిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సుంకిశాల ఘటన మరువక ముందే మరో దుర్ఘటన జరగడం ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌పై పారదర్శకంగా విచారణ జరిపించాలని అన్నారు.

## టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని ఆరా

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ ఆరా తీశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను రేవంత్‌రెడ్డి.. ప్రధానికి వివరించారు. సొరంగంలో ఎనిమిది మంది చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఘటనా స్థలికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్టు ప్రధాని మోదీ.. సీఎంకు చెప్పారు. పూర్తి స్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 3 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు టన్నెల్ వద్దకు చేరుకున్నాయి. విజయవాడ నుంచి రెండు, హైదరాబాద్ నుంచి ఒక బృందం ఘటనా స్థలికి చేరుకున్నాయి. సింగరేణి నిపుణుల బృందం కూడా అక్కడికి వెళ్లనుంది. నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలిలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద శనివారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు పడిపోయింది. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం పనులను తిరిగి ప్రారంభించింది. ఇందులో భాగంగా నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం మొదటి షిఫ్ట్‌లో సుమారు 50 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా.. అకస్మాతుగా పైకప్పు కూలింది. దీంతో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. వారిలో 42 మంది బయటకి రాగా.. 8 మంది కార్మికులు లోపల చిక్కుకున్నారు.

# రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డి శ్రీనివాసరావు

## రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ధరావత్ రమణ








తల్లాడ/ఫిబ్రవరి22(జర్నలిస్ట్ వార్త): ప్రగతిశీల హమాలి అండ్ మిల్ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డి శ్రీనివాసరావు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ధరావత్ రమణ ను ఎన్నుకోవడం జరిగిందని టియుసిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ లాల్మియా శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగతిశీల హమాలి అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ (టి యు సి ఐ అనుబంధం తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు శుక్రవారం ఖమ్మం నగరంలో 300 మంది ప్రతినిధులతో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మహాసభలో నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన డి శ్రీనివాసరావు నిరంతరం కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్నారని విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ ఈ క్రమంలో శ్రమజీవులు హక్కుల కోసం ఎంతగానో కృషి చేశారాని వివరించారు. డి శ్రీనివాసరావు రాష్ట్ర మహాసభ ప్రధానకార్యదర్శిగా ఎన్నుకోవడం శుభపరిణామని వారు తెలిపారు. ఈ మహాసభలు భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం జరిగింది, పఠాన్ నాగుల మీరా ధరావత్ రమణ ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు. భవిష్యత్తులో కార్మికుల సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం వీరి పైన ఉందని శ్రమజీవుల పోరాటంలో వీరు ముందుండాలని వారు తెలిపారు.

# లంబాడీల ఆరాధ్యదైవం సేవాలాల్

## కాంగ్రెస్రే పార్టీ నాయకులు గళ్ల శ్రీనివాసరావు

తల్లాడ/ఫిబ్రవరి22(జర్నలిస్ట్ వార్త): లంబాడీల ఆరాధ్యదైవం సేవాలాల్ అని తల్లాడ మండల కాంగ్రెస్రే పార్టీ నాయకులు గళ్ల శ్రీనివాసరావు అన్నారు. శనివారం సేవాలాల్ జయంతి వేడుకల్లో భాగంగా వైరాలో జరిగిన సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో తాను హాజరు కావడం జరిగిందన్నారు. ఈ వేడుకల నేపథ్యంలో ఆయనకు ప్రత్యేక తలపాగా ధరించి ఉత్సవాల్లో వారి సాంప్రదాయ ప్రకారం నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఆయన వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# రాజకీయాల్లోకి యువకులు రావాలి

తల్లాడ/ఫిబ్రవరి22(జర్నలిస్ట్ వార్త): రాజకీయాల్లోకి యువకులు రావాలని తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. శనివారం తల్లాడ మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకులు దుగ్గిదేవర యుధిష్టర్ జన్మదిన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రిని ఆయన శు క్రవారం హైదరాబాదులో కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆయనకు జన్మదిన శు భాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. తాత, తండ్రి బాటలో నడుస్తూ ప్రజలకు సేవలు చేయాలని, రానున్న రోజుల్లో ఉన్నత పదవులు అధిరోహించాలని కేసీఆర్ ఆకాంక్షించారు. యుధిష్టర్ తండ్రి దుగ్గిదేవర వెంకట్



లాల్ తల్లాడ మండల బీఆర్ఎస్ పార్టీలో కీలకంగా ఉండటంతో పాటు రైతు సమన్వయ సమితి అధ్యక్షులుగా పనిచేశారు. ఆయన తాత, నాయనమ్మ, తండ్రి వారసత్వాన్ని పురస్కరించుకొని యుధిష్టర్ రాజకీయాల్లోకి రావాలని కేసీఆర్



ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన కేసీఆర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్యకు ప్రధాన అనుచరుగా ఉనందుకే ఈ సదావకాశం దక్కిందని గుర్తు చేశారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన జక్కంపూడి కిషోర్



తల్లాడ/ఫిబ్రవరి22(జర్నలిస్ట్ వార్త): తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామనికి చెందిన కొమ్మినేని శ్రీనివాసరావు ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందాగా శనివారం దశ దిశ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జక్కంపూడి కిషోర్ హాజరై శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యుల పరామర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు .ఈ కార్యక్రమంలో వారి వెంట సామినేని రామప్పరావు, రాయల లచ్చయ్య, రాయల గోవిందు సింధ్యాల, నారాయణ రావు , డాక్టర్ రామకృష్ణ,వెంకటయ్య ,ఇంజ వెంకటయ్య, నాగులు మేర ,ఉప్పెర్ల సత్యం ఉప్పెర శ్రీనివాసరావు , రామకృష్ణ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

# మృతుని కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేత




**తల్లాడ/ఫిబ్రవరి22(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం, కలకొడిమ గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన ఆదూరి రమణయ్య (రఫాయేలు) కుటుంబానికి బహుజన అభ్యుదయ సేవా సమితి,హ్యూమన్ రైట్స్ సొసైటీ ద్వారా శనివారం 50 కేజీల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆనందం మాట్లాడుతూ రఫాయేలు గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరం అని తన వ్యక్తిత్వంతో, మంచితనంతో గ్రామస్తుల మనసులు చూరగోన్నాడని కొనియాడారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. స్థానికంగా సేవచేస్తున్న బిలివర్స్ చర్చి బిషప్. ఆదూరి సాల్మాన్ రాజు మాట్లాడుతూ రఫాయేలు కుటుంబ పరిస్థితులు గమనించి, సహాయం చేసిన హ్యూమన్ రైట్స్ సొసైటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సొసైటీ కో-ఫౌండర్ ఆదూరి మణి,గ్రామంలో సేవ చేస్తున్న కేరళ పాస్టర్. బిన్ను, హ్యూమన్ రైట్స్ సొసైటీ తల్లాడ మండల అధ్యక్షులు ఆదూరి బాబు (మిమిక్రి )తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు ను విమర్శించే స్థాయి బిఆర్ యస్ నాయకులకు లేదు

## -సత్తుపల్లి నియోజకవర్గం టిడిపి ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు నారపోగు ప్రసాద్





తల్లాడ/ఫిబ్రవరి22(జర్నలిస్ట్ వార్త): చంద్రబాబు ను విమర్శించే స్థాయి బిఆర్ యస్ పార్టీ నాయకులకు లేదని సత్తుపల్లి నియోజకవర్గం టిడిపి పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు నారపోగు ప్రసాద్ అన్నారు. శనివారం తల్లాడపట్టణంలోని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోని మాట్లాడాలన్నారు. జగదీష్ రెడ్డి స్థాయికి మించి చంద్రబాబు పై విమర్శలు చేస్తున్నాడని మరొకసారి ప్రాంతీయవాదం లేవనెత్తి ప్రజలను రెచ్చగొట్టే విమర్శలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. టీ డి పి పార్టీ తెలంగాణలో 1,80,000 క్రియాశీలక సభ్యత్వాన్ని కలిగి ఉన్న జాతీయ పార్టీ అని గుర్తు చేశారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన చంద్రబాబుపై బిఆర్ యస్ నాయకులు ఎన్ని విమర్శలు చేసినా, తెలంగాణలో బీఆర్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం అసంభవమన్నారు. తెలుగుదేశం హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలు మర్చిపోలేదని తెలిపారు. అధికారానికి దూరమై దిక్కుతోచిని స్థితిలోఉన్నారన్నారు. బలమైన సంస్థాగత నిర్మాణం కలిగిన తెలుగుదేశం పార్టీ రాబోయే ఎన్నికల్లో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందన్నారు. పక్క రాష్ట్రంలో వైయస్సార్ పార్టీ జగన్ సైకో పాలనలో పూర్తిగా దివాళా తీసిన ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టి, కూటమి నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పాలనను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో జరగనున్న స్థానిక సంస్థలు, మున్సిపాలిటీల ఎన్నికల్లో ప్రజల సంపూర్ణ మద్దతు తెలుగుదేశం పార్టీకి వుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులుగా



ధర్మసాగర్/ఫిబ్రవరి22 (జర్నలిస్ట్ వార్త):హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు .విద్యార్థులే ఉపాధ్యాయులుగా ఉదయం అసెంబ్లీ మొదలు, రోజువారి తరగతులు ,ప్రయోగశాలలో ప్రయోగాలు చేయించడం ,మధ్యాహ్న భోజన ఏర్పాట్లు, మైదానంలో ఆటలు, సహ పాఠ్య కృత్యాలు, విద్యార్థులకు స్లిప్ టెస్టులతో మూల్యాంకనం చాలా ఉత్సాహవంతంగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో ఉపాధ్యాయులుగా తమ పాత్ర నిర్వహించిన విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ధర్మ ప్రకాష్ మాట్లాడుతూ పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలన దినోత్సవం విద్యార్థులలో ప్రజాస్వామ్య విలువలు , నాయకత్వ లక్షణాలను పెంపొందించిందని ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు మంచి బోధన పటిమను ప్రదర్శించారని , ఆర్జెడి , డీఈవో , ప్రధానోపాధ్యాయులు గా వ్యవహరించిన విద్యార్థులు పాఠశాల పాలన వ్యవహారాలను బాధ్యతతో నిర్వహించడంతో వారంతా భవిష్యత్తు పౌరులుగా వారి సామర్థ్యాలను పట్టుదలతో నిర్వహించే అవకాశం కలిగిందని అన్నారు. ఉపాధ్యాయులు సురేష్, రాజమ్మ, కిరణ్ మై ,ప్రసన్నల మార్గదర్శకత్వంలో విద్యార్థులలో స్వీయ క్రమశిక్షణ జట్టు కృషి, జవాబుదారీతనం లాంటి విలువలు పెంపొందించడానికి దోహదపడతాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# నిర్దేశిత గడువులోపు అభివృద్ధి పనులను పూర్తి చేయాలి







## -వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ /ఫిబ్రవరి22(జర్నలిస్ట్ వార్త):** పీఎం శ్రీ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ కార్యాలయంలో కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మిలతో కలిసి పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన 16 ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించుటకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం కింద మొదటి విడుత లో 10 ప్రభుత్వ పాఠశాలల్లో 2 కోట్ల 74 లక్షల 15వేల రూపాయల నిధులతో పాఠశాలల్లో ఎల్ఈడి లైట్లు ఏర్పాటు,పాఠశాలలో పచ్చదనం, వర్మి కంపోస్ట్, కిచెన్ గార్డెన్ లు , వివిధ రంగులతో కూడిన డస్ట్ బిన్ల , స్వచ్ఛత పక్వాడ స్వచ్ఛతనం కార్యక్రమం, నిపుణుతో చర్చలు, వైజ్ఞానిక క్షేత్రస్థాయి సందర్శనలు తదితర అంశాలను ప్రణాళికబద్ధంగా వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. రెండవ విడతలో పీఎం శ్రీ పథకం కింద 6 ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన 20 లక్షల 25 వేల 500 రూపాయల నిధులతో ఎల్ఈడి లైట్లు ఏర్పాటు పాఠశాలల్లో స్వచ్ఛ పచ్చదనం పెంపొందించుట హెర్బల్ గార్డెన్ ల ఏర్పాటు, డిప్ ఇరిగేషన్ సిస్టం, వర్మీ కంపోస్ట్ ఇంకుడు గుంటలు, వివిధ రంగులతో కూడిన డస్ట్ బిన్లు, స్వచ్ఛత పక్వాడ స్వచ్ఛదనం కార్యక్రమం, నిపుణతో చర్చలు, విద్యార్థులకు క్షేత్రస్థాయి వైజ్ఞానిక సందర్శన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వర్మి కంపోస్టులు, ఇంకుడు గుంటలు ఏర్పాటు, జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు, రెడ్కో సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఎల్ఈడీ బల్బుల ఏర్పాటుకు నిత్యం పర్యవేక్షిస్తూ సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో మార్చి మొదటి వారంలోగా ఆయా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ కౌసల్యాదేవి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, సెక్టోరల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



రాయపర్తి/ఫిబ్రవరి 22(జర్నలిస్ట్ వార్త): మండలంలోని బందనపెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోత్ రజిత-కిషన్ నాయకుల కుమారుడు అరుణ్ కుమార్-శిరీష వివాహ వేడుకలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి,తొర్రూర్ బ్లాక్ అధ్యక్షులు జాటోత్ హేమ్య నాయక్,మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి,మండల యూత్ అధ్యక్షులు బొమ్మెర కళ్యాణ్ గౌడ్,ఉల్లంగుల నర్సయ్య, రెంటాల గోవర్ధన్ రెడ్డి,ఎండి నయీమ్,మునావత్ మోహన్ నాయక్లి,గ్రామ పార్టీ అధ్యక్షుడు బాసాటీ కిషన్ రావు,యాదగిరి,దేదావత్ రామా నాయక్,భూక్య లక్య,కందుకూరి కృష్ణ, కుసుంబాచారి,కౌడాగాని రమేష్, లెక్క బాబు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ప్రతినెల నాల్గవ శనివారం ప్రత్యేక ప్రజావాణి





వరంగల్/ఫిబ్రవరి22(జర్నలిస్ట్ వార్త): దివ్యాంగులకు ప్రతినెల నాల్గవ శనివారం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా వెల్లడించారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి దివ్యాంగులు, వయోవృద్ధుల నుండి వినతులు స్వీకరించి సంభందిత అధికారులకు మానవతా దృక్పథంతో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. నేటి ప్రజావాణిలో దివ్యాంగులు, వయోవృద్ధుల నుండి వినతులు స్వీకరించిన (13) దరకాస్తుల్లో. డిఎస్పిడిఓ కు సంబందించి 7, జిల్లా సంక్షేమ శాఖ 5, జిల్లా పరిషత్తు కు సంబంధించిన 01 ఉన్నాయి.ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ కౌసల్యాదేవి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు, వయోవృద్ధుల తదితరులు పాల్గొన్నారు.

## పౌడర్ పాలు వికటించి కవల పిల్లలు మృతి






గణపురం/ఫిబ్రవరి22/(జర్నలిస్ట్ వార్త): పౌడర్ పాలు వికటించి కవల పిల్లలు మృతిచెందిన సంఘటన శనివారం గణపురం మండల కేంద్రంలోని గొల్లపల్లి గ్రామంలోనెలకొంది బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గణపురం మండల కేంద్రంలోని గొల్లపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. పౌడర్ పాలు వికటించి నాలుగు నెలల కవల పిల్లలు మృతి చెందినట్లు తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే మర్రీ అశోక్-లాస్య దంపతులకు నాలుగు నెలల క్రితం రెండో సంతానంలో కవలు ( పాప, బాబు) జన్మనించారు. తాజాగా లాస్య పిల్లలతో తల్లిగారిల్లు అయిన నగరం పల్లెకి వెళ్లింది. పాలు పిల్లలకు సరిగా అందకపోవడంతో.. భర్తకు విషయం చెప్పగా గణపురం మండల కేంద్రంలోని ఓ మెడికల్ షాపులో పాల పౌడర్ తీసుకొచ్చాడు. దీంతో శనివారం ఉదయం 8 గంటలకు ఒకసారి, 10 గంటలకు మరోసారి తాగించి పిల్లలను పడుకోబెట్టింది. అయితే 12 గంటల సమయంలో పిల్లల్లో కదిలికపోవడంతో.. అనుమానం వచ్చి చూడగా ముక్కుల్లోంచి పాలు కారుతూ కనిపించింది. దీంతో హుటాహుటినా స్థానిక ఆర్ఎంపీ వద్దకు వెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని, ఆస్పత్రికి వెళ్లాలని సూచించగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పౌడర్ పాలు తాగడం వల్లే పిల్లలు మృతి చెందినట్లు తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న బిడ్డలు కనుల ముందే విగతజీవులగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచెయ్యాలి

**- పదవులు కోరుకుంటే రావు, ప్రజల మన్ననలు పొందితేనే అన్ని అవకాశాలు.**

**-ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



శాయంపేట/ఫిబ్రవరి22(జర్నలిస్ట్ వార్త): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని, కష్టపడ్డ ప్రతీ ఒక్కరికీ అవకాశాలు వస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం శాయంపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అన్ని గ్రామాల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం నిరుద్యోగులను తీవ్రంగా వంచించిందని ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాస, భాజాపా కలిసిపోయి లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నాయని అన్నారు. యువత నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీని నెలకొల్పినట్లు తెలిపారు. పేద, నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి 50 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు అన్ని గ్రామాలలో పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించాలని, అందుకొరకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కష్టపడే ప్రతి ఒక్కరికి అవకాశాలు వస్తాయని, పదవులు కోరుకుంటే రావని, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లే బాధ్యత గ్రామ నాయకులదేనన్నారు. వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. పాత, కొత్త నాయకత్వం అని తేడా లేకుండా పనిచేయాలన్నారు. గ్రామాలలో వర్గాలుగా విడిపోయి పార్టీకి నష్టం చేసేలా చూస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో మానసిక దృఢత్వాన్ని పెంపొందించడానికే స్ఫూర్తి

**-వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద**

**-విద్యార్థులతో కలిసి పక్షి షార్ట్ ఫిలిం వీక్షించిన కలెక్టర్**

**-15 ఏళ్లలో ప్రపంచాన్ని శాసించే స్థాయి లో భారత యువత**

**-10వ తరగతిలో 9.7 జీపీఏ సాధించే విద్యార్థులకు దావత్ ఇస్తానన్న కలెక్టర్**











**వరంగల్ /ఫిబ్రవరి22(జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల్లో మానసిక దృఢత్వాన్ని పెంపొందించడానికే "స్ఫూర్తి" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద అన్నారు. శనివారం వరంగల్ నగర పరిధి ఎన్ ఎన్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో జరిగిన స్ఫూర్తి కార్యక్రమంలో కలెక్టర్ సత్య శారద, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి హాజరైనారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి వారు భవిష్యత్తులో ఏం కావాలనుకున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికనుగుణంగా క్రమశిక్షణతో ఇష్టపడి చదవాలన్నారు. పదవ తరగతిలో 9.7 జీపీఏ సాధించే విద్యార్థులకు దావత్ ఇస్తానని కలెక్టర్ చెప్పారు. విద్యార్థులు భయం వీడితే ఏదైనా సాధించగలరని జిల్లా స్థాయి లో పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నెలకొల్పే విధం గా ప్రేరణ కలిగిస్తున్నామని తెలిపారు. వచ్చే 15 ఏళ్లలో ప్రపంచాన్ని శాసించే స్థాయిలో భారత యువత నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఆ స్థాయిలో తమ నైపుణ్యాలను పెంపొందించు కోవాలని, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ వినియోగించి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. మొబైల్ ఫోన్లను, సాంకేతికతను (టెక్నాలజీ) అవసరం మేరకే వినియోగించుకోవాలని, అధికంగా వినియోగిస్తే బానిస గా మారి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. విద్యార్థులకు సాయంత్రం వేళలో అందించే స్నాక్స్ ను రుచిచూసిన కలెక్టర్ బాగుందని అభినందించారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్ కు గురి అవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా స్పందించిన కలెక్టర్ ఏ సి పి తో చర వాణి లో మాట్లాడి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భం గా విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్స్ రైటింగ్ ప్యాడ్స్ ను కలెక్టర్ అందజేశారు.ఈ కార్యక్రమం లో డి ఆర్ డి ఓ కౌసల్య ఆర్ డి ఓ సత్యపాల్ రెడ్డి ఏం ఆర్ ఓ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# నెహ్రూ యువ కేంద్రం అడ్వెంచర్ క్యాంప్











**వరంగల్/ఫిబ్రవరి3(జర్నలిస్ట్ వార్త):** నెహ్రూ యువ కేంద్రం, హనుమకొండ జిల్లా "మై భారత్" ప్రోగ్రామ్ కింద వరంగల్ కోట, గుండు చెరువు పరిసర ప్రాంతంలో అడ్వెంచర్ క్యాంప్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నెహ్రూ యువ కేంద్రం ఉపదర్శకుడు చింతల అన్వేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హనుమకొండ జిల్లా యువజన,క్రీడల అధికారి గుగులోతు అశోక్ కుమార్ మాట్లాడుతూ, "అడ్వెంచర్ క్యాంప్ ద్వారా శారీరక దృఢత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పని చేసే నైపుణ్యం, సహకార భావన, సమస్యల పరిష్కార సామర్థ్యం, విమర్శనాత్మక ఆలోచన, భయాలను అధిగమించడం వంటివి అభివృద్ధి చెందుతాయి. ముఖ్యంగా, బాలికలు సామర్థ్యాన్ని ఏ రంగంలోనైనా ప్రదర్శించవచ్చు" అని పేర్కొన్నారు.ప్రత్యేక ఆహ్వానితులుగా జాతీయ యువజన పురస్కార గ్రహీత మండల పరశురాములు (భారత ప్రభుత్వ పురస్కార విజేత) మాట్లాడుతూ, "అడ్వెంచర్ క్యాంప్ అనేది ప్రత్యేకమైన అనుభవాన్ని అందిస్తూ, శారీరక, మానసిక మరియు సామాజిక నైపుణ్యాలను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇది వ్యక్తులను తమ పరిమితులను దాటి ముందుకు సాగేందుకు ప్రోత్సహించి, సహజ వాతావరణాన్ని మరింతగా అర్థం చేసుకునేలా చేస్తుంది" అని అన్నారు. ఇది భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'మై భారత్' కార్యక్రమం ద్వారా యువతకు గొప్ప వేదికగా మారుతోంది. ఇంకా, "భారత ప్రభుత్వం అంతర్జాతీయ యువ మార్పిడి కార్యక్రమాలను ప్రారంభించాలని కోరుతున్నాను" అని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పర్యాటక అధికారి ఎం. శివాజీ, ప్రభుత్వ పింగ్లే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, డా. సువర్ణ (ఎన్సీసీ అధికారి), డా. మమత, డా. రత్నమాల (ఎన్ఎస్ఎస్ అధికారులు), డా. సురేశ్ బాబు, ఆర్. రాజేశ్వరి, అడ్వెంచర్ కోచ్‌లు పి. అన్విత, ఈశ్వర్ పాల్గొన్నారు. పింగ్లే డిగ్రీ కళాశాల విద్యార్థినుల కోసం రాక్ క్లైంబింగ్, లేదర్ క్లైంబింగ్, కయాకింగ్, టీమ్ బిల్డింగ్ వంటి మొత్తం అడ్వెంచర్ కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహించారు.

# అధికారంలో ఉండి ప్రతిపక్షాలపై బురద చల్లడం సిగ్గుచేటు

**-రాజలింగమూర్తి హత్య పై వెంటనే విచారణ వేగవంతం చేయాలి**

**- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతే కరుణాకర్ రెడ్డి**

**- వ్యవసాయం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొలాసాని లక్ష్మీ నరసింహా రావు**



గణపురం/ఫిబ్రవరి22(జర్నలిస్ట్ వార్త): అధికారంలో ఉండి ప్రతిపక్షాలపై బురద చల్లడం సిగ్గుచేటని,రాజలింగమూర్తి హత్య పై వెంటనే విచారణ వేగవంతం చేయాలని గణపురం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతే కరుణాకర్ రెడ్డి, వ్యవసాయం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొలాసాని లక్ష్మీ నరసింహా రావు లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల కుయుక్తులను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటున్నారని హత్యతో సంబంధంలేని వ్యక్తులను అపాధించేలా కాంగ్రెస్ నాయకులు కుట్ర పండుతున్నారు. హత్య విషయంలో రాజకీయం చేయడం మంచిది కాదని, హత్య కు భూ వివాదాలు కారణమని స్థానిక ప్రజలు, పోలిసులు చెప్పున్నప్పటికి, కావాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు,మాజీ మంత్రి హరీష్ రావు,మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డిపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత స్వేచతో కొట్లాడుకునే మీరు ప్రజలను పక్కదారి పట్టించేందుకు చిల్లర మాటలు మానేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డిపై ఇంకొకసారి నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.ఎవరి చరిత్ర ఏమిటో ప్రజలకు తెలుసని, ప్రభుత్వంలో ఉన్నది మీరే కదా దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. మీ అసమర్థ పాలనను కప్పిపుచ్చుకోవడానికి బీఆర్ఎస్ పై అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. సిగ్గులేకుండా ప్రెస్ మీట్ పెట్టి అసత్యపు ఆరోపణలు చేయడం ఏంటని.. ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీ పై అసత్యపు ఆరోపణలు చేయడం మానుకొని, ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎస్సిఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, చెల్పూర్ మాజీ సర్పంచ్ నడిపెల్లి మధుసూదన్ రావు, కార్యదర్శి పేరాల దేవేందర్ రావు కెటిఆర్ సేన జిల్లా అధ్యక్షులు వీసం భరత్ రెడ్డి,మాజీ సర్పంచ్ కట్ల ప్రశాంతి శంకరయ్య, సీనియర్ నాయకులు జానయ్య, బొట్ల స్వామి, మార్త సుధాకర్, గాజర్ల రాజు,సీతారాంపూర్ మాజీ సర్పంచ్ గంధం సుధాకర్, ధర్మరావుపేట గ్రామ కమిటీ ప్రెసిడెంట్ ఆకుల రాజకుమార్, ఓదెలు సాయి, చక్రి, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈడీ అధికారులపై దర్శకుడు శంకర్ ఆగ్రహం




ప్రముఖ తమిళ సినీ దర్శకుడు శంకర్ కు ఈడీ షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. 'రోబో' సినిమాకు సంబంధించి నమోదైన కాపీరైట్ ఉల్లంఘన కేసులో శంకర్ కు చెందిన రూ. 10 కోట్ల విలువైన మూడు స్థిరాస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఈడీ చర్యలపై స్పందించిన శంకర్... తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును కూడా పట్టించుకోకుండా ఈడీ అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడటం తనను ఎంతో బాధించిందని చెప్పారు. ఈడీ తీసుకున్న చర్యలను ఉద్దేశించి పలు విషయాలను ప్రజల దృష్టికి తీసుకురావాలనుకుంటున్నానని శంకర్ తెలిపారు. 'రోబో' సినిమాకు సంబంధించి నిరాధారమైన ఆరోపణలను చూపించి తనకు చెందిన మూడు స్థిరాస్తులను తాత్కాలికంగా అటాచ్ చేశారని చెప్పారు. 'రోబో' కథకు సంబంధించి ఆరూర్ తమిళ్ నాడాన్ వేసిన పిటిషన్ ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చిందని... ఆ తీర్పును విశ్వసించకుండా, కేవలం ఫిర్యాదు ఆధారంగా ఈడీ తన ఆస్తులను జప్తు చేసిందని అన్నారు. ఈడీ చర్య న్యాయపరమైన వాస్తవాలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. ఆస్తుల అటాచ్ మెంట్ ను సవాల్ చేస్తూ అప్పీల్ కు వెళతానని చెప్పారు. ఈడీ అధికారులు తమ చర్యలపై పునఃసమీక్ష జరుపుతారని భావిస్తున్నానని శంకర్ తెలిపారు.

# నాని సహ నిర్మాతగా చిరంజీవి చిత్రం



మెగాస్టార్ చిరంజీవి వరుసగా సినిమాలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇకపై తన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉంటుందని ఇటీవల ఓ కార్యక్రమంలో ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో 'దసరా' ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చిరంజీవి సినిమా చేయబోతున్నారు. ఈ సినిమాకు హీరో నాని సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ సినిమా గురించి నాని కీలక అప్ డేట్ ఇచ్చారు. ఈ చిత్రం యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతుందని చెప్పారు. వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. చిరంజీవి సినిమాల విషయానికి వస్తే... ప్రస్తుతం ఆయన 'విశ్వంభర' షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. వేసవికి ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తదుపరి చిత్రం అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేయనున్నారు. నాని విషయానికి వస్తే... ప్రియదర్శి ప్రధాన పాత్రలో నాని సమర్పణలో 'కోర్ట్' సినిమా తెరకెక్కింది. వచ్చే నెల 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాకు సంబంధించి నాని ప్రచార కార్యక్రమాలను కూడా మొదలు పెట్టారు. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో నాని మాట్లాడుతూ... చిరంజీవి సినిమా గురించి అప్ డేట్ ఇచ్చారు.

# హీరో రామ్‌ను కలిసిన మంత్రి కందుల దుర్గేష్

కథానాయకుడు రామ్ తన తాజా చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం మహేష్ బాబు.పి దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు. భాగ్య శ్రీ బోర్సే నాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై యలమంచిలి రవిశంకర్, మహేష్ బాబు.పి నిర్మిస్తున్నారు. 'డబుల్ ఇస్మార్ట్' వంటి భారీ పరాజయం తరువాత హీరో రామ్ నటిస్తున్న చిత్రమిది. రామ్ కెరీర్‌లో 22వ చిత్రంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి ఇంకా టైటిల్ నిర్ణయించలేదు.ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. కాగా ఈ చిత్రం షూటింగ్ సెట్‌ను శనివారం (ఈ రోజు) ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. ఈ సందర్భంగా రామ్ పోతినేనితో ఆయన కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ "రామ్‌లోని ఎనర్జీ, డ్యాన్సులు నాకెంతో ఇష్టం. రబ్బరు స్ప్రింగ్ తరహాలో బాడీని డ్యాన్స్ మూమెంట్స్‌తో మౌల్డ్ చేస్తాడు. ఇప్పటి వరకు ఏపీలో ఉన్న పర్యాటక ప్రాంతాల్లో, గోదావరి నది తీర ప్రాంతాల్లో చిత్రీకరణ చేసిన సినిమాలు దాదాపుగా విజయాలుగా నమోదు చేసుకున్నాయి.ఈ సినిమా కూడా ఆ కోవలోనే విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు. ఇక రెండు వారాల క్రితం ఈ సినిమా చిత్రీకరణ రాజమండ్రిలో మొదలైంది. ఈ చిత్రీకరణ కోసం హాజరైన హీరో రామ్‌కు ఇక్కడ ఆయన అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మధు నీలకందన్, సంగీతం: వివేక్.






# ఓటిటికి ముందే టీవిల్లో సక్రాంతికి వస్తున్నాం

విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాఓటిటికి ముందే టీవీలో ప్రేక్షకులను అలరించనుంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించారు. ఈ సంక్రాంతి పండుగకు ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. అయితే ఈ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఓటీటీ లవర్స్‌కి షాక్ ఇస్తూ.. ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సినిమాను ఓటీటీ కంటే ముందుగా టీవీలో టెలికాస్ట్ చేయబోతున్నట్లు ప్రకటించింది. మార్చి 1 సాయంత్రం 6 గంటలకు జీతెలుగులో ఈ సినిమా ప్రీమియర్ కాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. మరోవైపు ఈ చిత్రం ఓటీటీ తేదీ మరింత ఆలస్యం కాబోతున్నట్లు తెలుస్తుంది.

# ఆది పినిశెట్టి 'శబ్దం'..



టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి ఇప్పుడు శబ్దం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. దర్శకుడు అరివళగన్ తెరకెక్కిస్తున్న ఆ సినిమాలో లక్ష్మీ మీనన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఇప్పటికే అరివళగన్, ఆది పినిశెట్టి కాంబోలో వైశాలి మూవీ వచ్చి అందరినీ ఆకట్టుకుంది. దీంతో ఇప్పుడు శబ్దం మూవీపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఆది పినిశెట్టి పారానార్మల్ ఇన్వెస్టిగేటర్ పాత్రలో నటిస్తున్న ఆ సినిమా.. ఫిబ్రవరి 28వ తేదీన థియేటర్లలో రిలీజ్ కానుంది. రీసెంట్ గా శబ్దం మేకర్స్.. ట్రైలర్ ను రిలీజ్ చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమాపై ఆడియన్స్ లో పాజిటివ్ బజ్ నెలకొంది. సైకలాజికల్ ఇన్‌స్టిగేటివ్ థ్రిల్లర్ గా మూవీ ఉండనున్నట్లు.. ఇప్పటికే క్లియర్ గా అర్థమైంది. గబ్బిలాల శబ్దంతో బాధపడుతున్న ఓ మహిళ చుట్టూ సినిమా సాగుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. గబ్బిలాలు, దెయ్యం లాంటి సన్నివేశాలు... ఆడియన్స్ లో సినిమాపై మరింత ఆసక్తిని రేపుతున్నాయని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. అయితే ఇప్పుడు శబ్దం మేకర్స్.. పాత అండ్ రిస్కీ ట్రెండ్ ను ఫాలో అయ్యారు. అదేంటంటే.. గతంలో నిర్మాతలు తమ సినిమాలను అధికారిక విడుదలకు ముందే పంపిణీదారుల కోసం ప్రదర్శించేవారన్న విషయం తెలిసిందే. దాని ఆధారంగా థియేట్రికల్ బిజినెస్ నిర్వహించేవారు. కానీ కొద్ది రోజులుగా అలా జరగడం లేదు. ఇప్పుడు శబ్దం.. ఆ ట్రెండ్ ను రీస్టార్ట్ చేసింది. ఎందుకంటే శబ్దం థియేట్రికల్ రైట్స్ ను కొనుగోలు చేయడానికి డిస్ట్రిబ్యూటర్స్ పెద్ద ఆసక్తి చూపలేదని ఆ మధ్య వార్తలు వచ్చాయి. దీంతో నిర్మాతలు అవుట్ పుట్ పై చాలా నమ్మకంగా ఉండటంతో ఏరియా వారీగా పంపిణీదారుల కోసం ప్రత్యేక స్క్రీనింగ్ ఏర్పాటు చేశారు.

# ఆర్సీ 16 లో ప్రగ్యాజైశ్వాల్ ?



ముంబై బ్యూటీ ప్రగ్యాజైశ్వాల్ టాలీవుడ్ లో మళ్లీ బిజీ అవుతోందా? స్టార్ హీరోల చిత్రాల్లోనే అవకాశాలు అందుకుంటుందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తుంది. ఈ సంక్రాంతి కి రిలీజ్ అయిన 'డాకు మహారాజ్' లో నటించింది. ఆ సినిమా మంచి విజయం సాధించింది. ఆ రకంగా బాలయ్య అవకాశం ఇవ్వడంతో? మరో సక్సెస్ ఖాతాలో నమోదైంది. కొత్త ఏడాదిని అమ్మడు అలా లాంచ్ చేసింది. అటుపై వెంటనే అదే బాలకృష్ణ తో 'అఖండ2' లోనూ ఛాన్స్ అందుకుంది. ఇది పాన్ ఇండియా చిత్రం. బోయపాటి శ్రీను భారీ కాన్వాస్ పై తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాలో ఛాన్స్ రావడంతో ప్రగ్యా ఇమేజ్ రెట్టింపు అయింది. అలాగే సాయి శ్రీనవాస్ బెల్లంకొండ నటిస్తోన్న 'టైసన్ నాయుడు'లోనూ నటిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా అమ్మడికి మరో బంపర్ ఆఫర్ కూడా వరించినట్లు తెలుస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో చరణ్ కి జోడీగా ఇప్పటికే జాన్వీ కపూర్ నటిస్తోంది. ఈనేపథ్యంలో ఇదే సినిమాలో ప్రగ్యా జైశ్వాల్ ని ఓ కీలక పాత్రకు ఎంపిక చేసినట్లు సమాచారం. సినిమాలో ఆ పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుందని మెగా లీకులందుతున్నాయి. ప్రగ్యా జైశ్వాల్ రోల్ చాలా మాసివ్ గా ఉంటుందిట. తొలుత ఆ పాత్ర కోసం అనసూయని తీసుకోవాలనుకున్నారుట. కానీ ఆమె ఇప్పటికే 'రంగస్థలం'లో మాస్ రోల్ చేయడంతో? ఫ్రెష్ నెస్ రాదని భావించి బుచ్చిబాబు ఫాంలో ఉన్న ప్రగ్యా జైశ్వాల్ అయితే బాగుటుందని అమెని అప్రోచ్ అయినట్లు వినిపిస్తుంది. మరి ఈ ప్రచారంలో నిజమెంతో తెలియాలి.